# బీఆర్‌ఎస్‌కే ప్రజా మద్దతు

**ఉమ్మడి రంగారెడ్డి** జిల్లాలో రోజురోజుకూ బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరిక లు జోరుగా సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం లో తొమ్మిదన్నరేండ్లలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుతుండడంతో బీఆర్‌ఎస్ తిరుగులేని శక్తిగా అవతరిస్తున్నది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ కపట కాంగ్రెస్ పార్టీ మాటలను ప్రజలు నమ్మవద్దని..అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

**మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలోకి జోరుగా సాగుతున్న చేరికలు**

**ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ..**

**తిరుగులేని శక్తిగా అవతరిస్తున్న గులాబీ పార్టీ**



అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కంసాన్‌పల్లికి చెందిన మైనార్టీ నాయకులు

## కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మొద్దు

- కొడంగల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- పార్టీలో చేరిన చంద్రవంచ, కడంపల్లి, దోరెపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కోస్గి మండలంలోని కడంపల్లి గ్రామానికి చెందిన మహిళలు

కొడంగల్, నవంబర్ 11: సీఎం కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని.. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందించి అండగా ఉంటున్నదని కొడంగల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కోస్గి మండలంలోని చంద్రవంచ, కడంపల్లి గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అదేవిధంగా కొత్తపల్లి మండలంలోని దోరెపల్లి గ్రామానికి చెందిన 80 మంది మైనార్టీలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని..తెలంగాణలో జరుగుతున్న ప్రగతి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సం ఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. ఈ అసెం బ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాటలను నమ్మొద్దని సూచించారు. ఆ పార్టీ గ్యారంటీలకు వ్యారంటీ లేదన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటేయండి

- బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- పార్టీలో చేరిన కంసాన్‌పల్లికి చెందిన మైనార్టీలు, కొండారెడ్డిపల్లికి చెందిన యువకులు

షాద్‌నగర్, నవంబర్ 11 : బీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతున్నది. పార్టీలకతీతంగా అన్ని పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో భారీసంఖ్యలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మి మోసపోవద్దని.. తెలంగాణ రాక ముందు ఎలా ఉండే.. వచ్చిన పదేండ్ల తర్వాత ఎలా ఉందో ఆలోచించి రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి పాటు పడేవారికి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా.. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాలన్నా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రధాన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామాలు, నాయకులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారు..

కేశంపేట: నియోజకవర్గంలో జరుగుతున్న ప్రగతి పనులను చూసే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన పలువురు యువకులు శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారని.. ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలో చేరిన రవి, మహేందర్, వెంకటేశ్, అనిల్ తదితరులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌పంతులు, జగన్‌మోహన్‌రెడ్డి, దశరథ పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం




చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన తొర్మామిడి గ్రామానికి చెందిన మైనార్టీ యువకులు

**చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి**

మర్పల్లి, నవంబర్ 11 : సీఎం కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం బంట్వారం మండలంలోని తొర్మామిడి గ్రామానికి చెందిన మైనార్టీ యువకుడు అబ్దుల్ అసిఫ్, వార్డు సభ్యుడు ఖదీర్‌పాషా, సమీర్, యూత్ ఐకాన్ సయ్యద్ షకిర్‌తోపాటు మరో 50 మంది యువకులు, అలాగే వివిధ పార్టీల నుంచి మరో 50 మంది యువకులు సీనియర్ నాయకుడు బలవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామా ధ్యక్షుడు నజీర్ ఆధ్వర్యంలో ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు.

### వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో..

మర్పల్లి మండలంలో కుడుగుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మౌలానా, కలీల్, శ్రీశైలం, సయ్యద్, శ్రీనుతోపాటు మరో 25మంది నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ యాదయ్య, ఉప సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మర్పల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్, గౌస్, హుస్సేన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య గౌ డ్, యాదవ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, వీరేశం, అంజయ్య పాల్గొన్నారు.



వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కుడుగుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు

## బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన

**బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి**

- పార్టీలో చేరిన తాండూరు, తాండూరు రూరల్, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు, నాయకులు, మైనార్టీ సోదరులు

తాండూరు, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్‌కు అపూర్వ మద్దతు లభిస్తున్నదని ఆ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా తాండూరు పట్టణంతోపాటు బషీరాబాద్, మల్కాన్‌గిరి, ఓగిపూర్, చెంగోల్, రేల్లగడ్డ తండా, పేర్కంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు కూడా ఎమ్మెల్యే సమక్షంలో కారెక్కారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందగా బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషమన్నారు. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు.

### రోహిత్‌రెడ్డిని గెలిపించుకుంటాం

తాండూరు రూరల్ : బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తాండూరు మండలం, చెంగోల్ గ్రామానికి చెందిన మహిళలు పేర్కొన్నారు. శనివారం వారు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ కండువాలు కప్పుకొన్నారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

### మైనార్టీలకు పెద్దపీట

పెద్దేముల్ : సీఎం కేసీఆర్ మైనార్టీల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ తాండూరు అభ్యర్థి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరులోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని దుగ్గాపూర్ గ్రామానికి చెందిన పలువురు మైనార్టీలు, ఇత ర నాయకులు బషీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఆరిఫ్, ఖదీర్, రేహాన్ పాల్గొన్నారు.

### పైలట్ వెంటే నడుస్తాం

బషీరాబాద్ : మండలంలోని బాద్లాపూర్, మల్కాన్‌గిరి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామ ఉప సర్పంచ్ మల్లేశ్, టాకి తండా రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో తమకు తగిన గుర్తింపు లేదన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంటే నడిచి ఆయన భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీను, వడ్డే నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలు